సాక్షి
రంగారెడ్డి
ఆదివారం ¦ 16 ¦ ఏప్రిల్ ¦ 2023





## చచ్చిందెవరో.. చంపిందెవరో!

పహాడీషరీఫ్ పరిసరాలు హత్యలకు నిలయాలుగా మారాయి. నిత్యం ఏదో ఒక చోట గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమవుతున్నాయి. 8లో▸




## మే 7న సైక్లింగ్ ఈవెంట్

సాక్షి, సిటీబ్యూరో: వచ్చే నెల 7న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు.

## నిమ్స్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

లక్డీకాపూల్: ఖాళీ పోస్టుల భర్తీకి నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) నోటిఫికేషన్ విడుదల చేసింది. మైక్రోబయోలాజీ విభాగంలో ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. రీసెర్చ్ ప్రాజెక్టుకు ల్యాబ్ టెక్నీషియన్లను భర్తీ చేయనున్నారు. శనివారం ఈ మేరకు నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతి వీర్ నోటిఫికేషన్ విడుదల చేశారు.




## న్యూస్‌రీల్

### 23న వీటీజీసెట్-2023 ప్రవేశ పరీక్ష

కందుకూరు: వీటీజీసెట్-2023 ఐదో తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఈ నెల 23న ( ఆదివారం) నిర్వహించనున్నట్లు సాంఘీక గురుకుల కళాశాల మహేశ్వరం ప్రిన్సిపాల్ ఈమని శ్రీలక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు ఈ నెల 12 నుంచే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయని డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్ టికెట్ల కోసం ఎంఎస్‌బడీ డాట్ కమ్/టీజీ-గురుకుల్-సెట్-2023-హాల్‌టికెట్స్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గూడూరు చౌరస్తా సమీపంలోని ఎస్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుందన్నారు. బ్లూ లేదా బ్లాక్ పెన్, హాల్‌టికెట్, మాస్కు, వాటర్ బాటిల్, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. హాల్‌టికెట్‌లో ఏవైనా తప్పులుంటే దానికి సంబంధించిన ధ్రువపత్రాలు జిరాక్స్ కాపీలను పరీక్షా కేంద్రాల్లో అందజేయాలని సూచించారు.

### వచ్చేవారం నందిగామ కొత్త ఠాణా ప్రారంభం



నందిగామలో పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ నారాయణ రెడ్డి తదితరులు

నందిగామ: నందిగామలో నాట్కో ట్రస్టు ఆర్థిక సాయంతో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను వచ్చే వారంలో ప్రారంభిస్తామని శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి అన్నారు. ఈ మేరకు ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఠాణాను షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్, ఇన్‌స్పెక్టర్ రామయ్యతో కలిసి శనివారం పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ చాంబర్, ఎస్ఐ గది, స్టాఫ్ రూం, హాల్ అన్నీ తిరిగి చూశారు. వచ్చే వారం మంచి రోజు చూసుకొని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట నాట్కో హెచ్ఆర్ మేనేజర్ సత్యనారాయణ ఉన్నారు.

### చీర్యాల లక్ష్మీనృసింహుడి సేవలో గవర్నర్



కీసర: చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్వామిసేవలో పాల్గొన్నారు. శనివారం గవర్నర్‌కు వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం యాగశాలలో నిర్వహించిన సుదర్శన నారసింహ హోమంలో గవర్నర్ పాల్గొన్నారు. అనంతరం వేదపండితులు గవర్నర్‌కు స్వామివారి ఆశీస్సులు అందజేయగా ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌లు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

### హైదరాబాద్ నా ఫేవరేట్ సిటీ

బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి



ఫర్నిచర్ షోరూమ్‌ను ప్రాంభిస్తున్న సునీల్ శెట్టి

గచ్చిబౌలి: హైదరాబాద్ తన ఫేవరేట్ సిటీ అని, 32 ఏళ్లుగా ఇక్కడికి వస్తున్నానని ప్రముఖ బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలో లాజే లైఫ్‌స్టైల్ ఫర్నిచర్ షోరూమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో సిటీ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. లాజే లైఫ్‌స్టైల్‌లో అద్భుతమైన డిజైన్‌తో ఫర్నిచర్ అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో లాజే లైఫ్‌స్టైల్ యజమాని శైలేంద్ర మెహతా, సహ యజమాని తనూజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేర్చేస్తాం.. సాధిస్తాం



లక్ష్యం వైపు పరుగు

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, క్రికెట్, స్విమ్మింగ్, స్కేటింగ్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, కరాటే, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడాంశాల్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు, అనుభవజ్ఞులైన శిక్షకులు కోచింగ్ ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్‌డీఓ వెంకటేశ్వర రావు కోరారు. ఆసక్తిగలవారు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు/జనన ధ్రువీకరణ పత్రంతో రావాలని సూచించారు. – హుడాకాంప్లెక్స్



కరాటేలో సై



టెన్నిస్ రాకెట్‌తో రెడీ




జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ



క్రికెట్‌లో మెలకువలు

# ‘ఎర్లీ’గా కట్టండి

- ఐదుశాతం రాయితీ అందుకోండి
- మున్సిపాలిటీల్లో ఎర్లీ బర్డ్ పథకం
- ముందస్తు పన్ను చెల్లింపునకు అవకాశం
- ఈనెల 30 వరకు చెల్లించిన వారికే చాన్స్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు




షాద్‌నగర్: ముందస్తుగా పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. పన్ను చెల్లించే మొత్తం రాయితీని ప్రకటించింది. ఆస్తిపన్ను రాబట్టుకునేందుకు, మున్సిపాలిటీలకు ఆదాయాన్ని సమకూర్చేందుకు మున్సిపల్ శాఖ ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ పథకంలో భాగంగా ముందస్తు పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పించింది. ఈనెల 30 వరకు ఈ పథకం అమల్లో ఉంటుంది.

**ఆదాయ వనరులు కీలకం**

మున్సిపాలిటీల నిర్వహణ, పౌరులకు అందించే సేవలు సక్రమంగా కొనసాగాలంటే సొంత ఆదాయ వనరులు కీలకం. ఈ మేరకు పన్నులు, ఇతర ఖాతాల ద్వారా సాధారణ నిధికి నిధులు జమకావాల్సి ఉంటుంది. ఇందులో జమయ్యే నిధుల్లో ప్రధాన వాటా ఆస్తి పన్నులదే. ఏటా ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఏడాది కాలవ్యవధితో ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

**విస్తృత ప్రచారం**

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుదారుల కోసం పురపాలక శాఖ ఎర్లీ బర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ఏప్రిల్ 1 నుంచే ప్రారంభమైంది. ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తుగా పన్ను చెల్లించే వారికి ఆస్తిపన్నులో ఐదుశాతం రాయితీ ఇస్తుంది. ఈనెల 30లోపు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ పథకంపై మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఆటోలను ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు.

**ఖజానా గలగల**

ఇళ్ల నిర్మాణాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో పన్నులు చెల్లించే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. జిల్లాలో మూడు కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీల్లో కలిపి ఎర్లీబర్డ్ పథకం కింద రాయితీ వర్తించే ఇళ్లు, వ్యాపార సముదాయాలు మొత్తం గత ఏడాది 1,82,722 ఉండగా ఈసారి 2,68,876కు చేరింది. వీటి నుంచి గతంలో రూ.95కోట్ల పైగా పన్నులు వసూలయ్యాయి. ఈసారి రూ.135.82 కోట్లు వసూలు కావాల్సి ఉంది. గత ఏడాది కంటే ఈ సారి 86,154 ఇళ్ల సదుపాయాలు పెరగడంతో ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం కూడా పెరగనుంది. ఈ పథకానికి పట్టణాల్లో మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకు సుమారు 30శాతం పన్నులు వసూలయ్యాయి. మున్సిపల్ శాఖ ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించడంతో చాలామంది ఈ పద్ధతిలోనే పన్ను చెల్లించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నెలాఖరు వరకు పెద్ద మొత్తంలో పన్నులు వసూలవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

| మున్సిపాలిటీ | రాయితీ వర్తించే ఇళ్లు | పన్ను డిమాండ్ (రూ.కోట్లలో) |
|---|---|---|
| బండగ్లోపేట కార్పొరేషన్ | 36,463 | 16.29 |
| నార్సింగి | 19,520 | 19.63 |
| మణికొండ | 35,144 | 22.6 |
| మీర్‌పేట కార్పొరేషన్ | 19,856 | 9.80 |
| బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ | 30,763 | 16.43 |
| పెద్ద అంబర్‌పేట | 15,830 | 6.62 |
| కొత్తూరు | 2,515 | 1.78 |
| షాద్‌నగర్ | 14,777 | 4.21 |
| ఆదిబట్ల | 5,129 | 1.94 |
| జల్‌పల్లి | 32,771 | 5.20 |
| తుర్కయంజాల్ | 17,823 | 7.91 |
| శంషాబాద్ | 14,627 | 11.51 |
| ఇబ్రహీంపట్నం | 6,362 | 3.49 |
| తుక్కుగూడ | 5,919 | 3.94 |
| శంకర్‌పల్లి | 6,076 | 3.87 |
| ఆమనగల్లు | 5,301 | 1.6 |

### అవగాహన కల్పిస్తున్నాం



2023– 24 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తిపన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకం కింద ఐదు శాతం రాయితీ ఇస్తోంది. ఈ పథకంపై ఇళ్ల యజమానులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ ద్వారా కూడా ఆస్తి పన్ను చెల్లించొచ్చు. ఈ నెల 30 వరకు చెల్లించే వారికి మాత్రమే రాయితీ లభిస్తుంది.

– వెంకన్న, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

### సద్వినియోగం చేసుకోవాలి



పన్నుల రూపంలో వచ్చే ఆదాయంతోనే ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. ముందస్తు పన్నులు చెల్లించే వారికి ఇచ్చే రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి.

– బాతుక లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్, కొత్తూరు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ రమణ

## దేశ ప్రజల చూపు తెలంగాణ వైపు

- కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ముచ్చటగా మూడోసారి ఆయనే సీఎం
- బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ రమణ

యాచారం: దేశ ప్రజల చూపు తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమం వైపు మళ్లిందని, దేశాభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందనే భరోసా ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. యాచారం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు దఫాలుగా సీఎంగా ఎన్నికైన కేసీఆర్ దేశ ప్రజలకు సేవ చేయడం కోసమే బీఆర్ఎస్ పార్టీని స్థాపించినట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై చర్చ జరుగుతోందని అన్నారు. దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. 125 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుతో కేసీఆర్ ప్రతిష్ట మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, అందుకే ఆ పార్టీల నేతలు తప్పుడు ప్రచారాల కోసం కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మూడోసారి కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. అంతకుముందు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, డైరెక్టర్లు తలారి మల్లేశ్, శంకర్‌నాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రమేష్‌గౌడ్, పాశ్ఛ బాష తదితరులు పాల్గొన్నారు.

## ఎద్దుల బండ్లకు నో ఎంట్రీ

- ప్రైవేట్ బస్సులు, వాణిజ్య వాహనాల రాకపోకలపై ఆంక్షలు
- సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, రద్దీని తగ్గించేందుకు, ప్రమాదాలను నివారించేందుకు సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. ఎద్దుల బండ్లు, సైకిల్ రిక్షాలు, తోపుడు బండ్లు, వ్యవసాయ పనుల్లో వినియోగించే యంత్రాలు, ట్రాక్టర్ల వంటి నెమ్మదిగా కదిలే వాహనాలతో సాధారణ ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ట్రాఫిక్ రద్దీకి కారణమవుతుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఆయా వాహనాల రాకపోకలను సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నిషేధం విధించారు. వీటితో పాటు అంతర్రాష్ట్ర వాహనాలు, నేషనల్ పర్మిట్ లారీలు, లోకల్ లారీలు, గూడ్స్ వంటి భారీ వాణిజ్య వాహనాలను, ప్రైవేట్ బస్సులపై పలు ఆంక్షలు విధించారు.

**ఏ వాహనాలకు ఎప్పుడు ప్రవేశం అంటే..**

- 10టన్నుల కంటే ఎక్కువ బరువు వస్తువులు సరఫరా చేసే వాణిజ్య వాహనాలకు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉదయం, రాత్రి సమయాల్లో రాకపోకలు నిషేధించారు.
- నిర్మాణ సామగ్రిని మోసుకెళ్లే వాహనాలు, లోకల్ లారీలకు రాత్రి 11 నుంచి ఉదయం 7 గంటల మధ్య అనుమతి ఉంటుంది.
- 3.5 టన్నుల నుంచి 12 టన్నుల లోపు బరువు వస్తువులను సరఫరా చేసే వాహనాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల మధ్య మాత్రమే అనుమతిస్తారు.
- జంట నగరాల్లో ప్రైవేట్ బస్సులకు ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల మధ్య నడపడానికి అనుమతి లేదు.



## అన్ని తరగతులకూ ఒకేచోట ‘పరీక్ష’

ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యార్థులు కంబైన్డ్ స్టడీస్ చేస్తున్నారనుకుంటే పొరపాటే... వారంతా వార్షిక పరీక్షలు రాస్తున్నారు. పదో తరగతి పరీక్షల స్పాట్ వ్యాల్యుయేషన్‌కు ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల్లో సగానికిపైగా వెళ్లారు. దీంతో పాఠశాలల్లో టీచర్ల కొద్ది మాత్రమే హాజరవుతున్నారు. ప్రస్తుతం 1 నుంచి 9వ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. ఒక్కో తరగతి గదిలో పరీక్షలు ఏర్పాటు చేస్తే టీచర్లు సరిపోయేంత మంది లేకపోవడంతో అందరినీ ఒకే జట్టుగా కూర్చోబెట్టి ఇలా పరీక్షలు రాయిస్తున్నారు. ఈ దృశ్యం ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం కనిపించింది. – బంజారాహిల్స్

## సైబర్ మోసాలతో జాగ్రత్త

మీర్‌పేట: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సైబర్ క్రైం డీసీపీ డా.బి.అనురాధ విద్యార్థులకు సూచించారు. రాచకొండ సైబర్ క్రైం ఆధ్వర్యంలో శనివారం మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ మోసాలు, వేధింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనురాధ మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న నేరాల్లో 50 శాతం సైబర్ మోసాలకు సంబంధించిన కేసులే నమోదవుతున్నాయని, నకిలీ ఐడీలు, సెల్‌ఫోన్‌లకు వచ్చే లింక్‌లను తెరిస్తే మీ బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు అంతా ఖాళీ అవడంతో పాటు వ్యక్తిగత సమాచారాన్ని దోచుకుంటారని, ఎట్టి పరిస్థితుల్లోనూ లింక్‌లు తెరవొద్దన్నారు. ముఖ్యంగా వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఉపయోగించే వారు జాగ్రత్తగా ఉండాలని, సరైన అవగాహన లేకుండా ఎలాంటి యాప్‌లను సెల్‌ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేసుకోవద్దని సూచించారు. రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు. అనంతం సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. ఉద్యోగ మోసాలు, రుణ మోసాలు, ఆన్‌లైన్ మార్కెట్, నకిలీ కస్టమర్ కేర్, పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ దొంగతనాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930, డయల్ 100కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, టీకేఆర్ కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, సైబర్ క్రైమ్స్ ఏసీపీ జి.వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్‌కుమార్, ఎస్ఐ బద్యానాయక్ పాల్గొన్నారు.




సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ అనురాధ

## పోలీసుల అదుపులో నిందితుడు

పహాడీషరీఫ్: గుర్తుతెలియని మహిళ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఇప్పటికే మహిళ వివరాలు సేకరించిన పోలీసులు.. హత్య చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఒకట్రెండు రోజుల్లో వెల్లడించనున్నట్లు మహేశ్వరం ఏసీపీ తెలిపారు. బడంగ్‌పేట్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్‌వ్యాపారి.. సూర్యాపేట్‌కు చెందిన గృహిణితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. సదరు వ్యక్తి గతంలో ఆమెకు డబ్బులు ఇచ్చాడు. ఇటీవల తిరిగి ఆ డబ్బులు అడగడంతో పరస్పరం వివాదం నెలకొని హత్యకు దారితీసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.





# చచ్చిందెవరో.. చంపిందెవరో!

## మిస్టరీగా మారుతున్న హత్య కేసులు

- అడ్డాగా మారిన నగర శివారు ప్రాంతాలు
- కేసులు ఛేదించలేక తలలు పట్టుకుంటున్న పోలీసులు
- నిఘాను ముమ్మరం చేయాలంటున్న స్థానికులు



జాగిలంతో పోలీసుల గాలింపు (ఫైల్)

పహాడీషరీఫ్: నగర శివారు ప్రాంతంగా ఉన్న పహాడీషరీఫ్ పరిసరాలు హత్యలకు నిలయాలుగా మారాయి. రోజూ ఎక్కడో ఒక చోట గుర్తు తెలియని వ్యక్తుల శవాలు లభ్యమవుతుండటమే ఇందుకు కారణం. ఇక్కడే హత్య చేస్తున్నారా? లేక ఎక్కడో హత్య చేసి అర్ధరాత్రి వేళ మృతదేహాలను ఇక్కడ పడేస్తున్నారా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఉదయాన్నే మృతదేహాలను చూస్తున్న పోలీసులు చచ్చిందెవరో....చంపిందెవరో తేల్చడానికి తలలు పట్టుకోవాల్సి వస్తోంది. జల్‌పల్లి పెద్ద చెరువు, తుక్కుగూడ హైవే పరిసరాలలో మృతదేహాలు లభ్యమవుతున్నాయి. కొన్ని సార్లు ఇతర ప్రాంతాలలో హత్య చేసి ఇక్కడ పడేస్తుండగా.. మరికొన్ని సార్లు ఇక్కడే పథకంలో భాగంగా హత మారుస్తున్నారు. ఇక్కడ లభ్యమవుతున్న మృతదేహాలను చూసి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సీసీ కెమెరాలను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి పూట గస్తీని ముమ్మరం చేయాలని కోరుతున్నారు.

**అధిక శాతం ఉత్తర భారతీయులే..**

ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన ప్రజలు జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చే వారు అధిక సంఖ్యలో ఉన్నారు. వారంతా ప్రస్తుతం పహాడీషరీఫ్ ఠాణా పరిసర ఠాణాలలో అధికంగా నివాసం ఉంటున్నారు. ఇలాంటి వారు హత్యకు గురవుతుండడం.. ఒక్కోసారి వీరే హత్యలు చేసి తమ స్వరాష్ట్రాలకు పారిపోతుండటంతో కేసుల దర్యాప్తు ముందుకు సాగని పరిస్థితి నెలకొంటుంది. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి నేరాల నివారణకు కృషి చేస్తామని పోలీసులు పేర్కొంటున్నారు. ఎక్కడో హత్య చేసి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిసరాలలో పడేసిన మృతదేహాలలో చాలా వరకు పోలీసులు కేసులను ఛేధించినప్పటికీ.. ఇంకొన్ని కేసులలో వివరాలు ఎటూ తేలలేని పరిస్థితి నెలకొంది.

**తేలని హత్య కేసుల్లో కొన్ని..**

- తుక్కుగూడ హైవే రోడ్డులో సర్దార్‌నగర్ గేట్ సమీపంలో ఈ నెల 12న గుర్తుతెలియని మహిళను హత్య చేసి సంచిలో కుక్కి పడేసి పోయారు.
- 2021 ఆగస్టు 3న జల్‌పల్లి కార్గో రోడ్డు పక్కన గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. రెండేళ్లు కావస్తున్నా మిస్టరీ వీడలేదు.
- మామిడిపల్లిలోని ఎస్ఎస్‌పీడీఎల్ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఉన్న గెస్ట్ హౌస్‌లో 2016 జూన్ 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమాకాంత్ పాండే (40) హత్యకు గురయ్యాడు. వెంచర్‌లోకి తాను తీసుకొచ్చిన ఓ యువతీ, యువకుడే ఈ దారుణానికి ఒడిగట్టాడని పోలీసులు భావించినప్పటికీ వారు ఇంకా దొరకలేదు.
- 2016 ఆగస్టు 13న పహాడీషరీఫ్-మామిడిపల్లి రహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేట్ సంస్థ ఆవరణలో 25 ఏళ్ల గుర్తు తెలియని యువకుడిపై పెట్రోల్ పోసి తగులబెట్టి హత్య చేశారు. మృతుడు ఎవరో తేలలేదు.
- 2020 ఏప్రిల్ నెలలో ఇదే సంస్థ ప్రాంగణంలో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమయ్యింది. ఈ కేసులోనూ ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.
- 2014 నవంబర్ 15న ఎర్రకుంట అలీ నగర్‌లో హత్యకు గురైన యువతి వివరాలు కూడా తెలియరాలేదు.

## రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి

- తల్లి పరిస్థితి విషమం

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందగా తల్లి తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు మండలం ఏనుగుమడుగు తండాకు చెందిన తల్లి మన్ని, కొడుకు చరణ్(18)తో కలిసి ద్విచక్రవాహనంపై బాలానగర్ నుంచి షాద్‌నగర్‌వైపు వస్తున్నారు. ద్విచక్ర వాహనం రాయికల్ టోల్‌ప్లాజా దాటిన తరువాత రామేశ్వరం కమాన్ వద్దకు రాగానే ఎదురుగా షాద్‌నగర్ నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మన్ని, చరణ్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఇద్దరిని శంషాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చరణ్ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మన్ని పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి సోదరుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.